సాక్షి
నిర్మల్
శనివారం । 30 । ఆగస్టు । 2025

వాతావరణం

గరిష్టం/కనిష్టం
30.3 /24.4

ఆకాశం పూర్తిగా మేఘావృతమై ఉంటుంది. ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరుగుతాయి. రుతు పవనాల ప్రభావంతో అక్కడక్కడ జల్లులు కురిసే అవకాశం ఉంది.

గోదారమ్మ మహోగ్రరూపం



మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు గోదావరి ఉగ్ర రూపం దాల్చింది. ఉప్పొంగి ప్రవహిస్తోంది. బాసరలో కాటేజీను వరద చుట్టుముట్టింది. పరీవాహక ప్రాంత పంటలను ముంచేసింది. బాసర రైల్వేస్టేషన్, శ్రీజ్ఞాన సరస్వతీ ఆలయ సమీపం వరకు నీళ్లు వచ్చాయి. ఆలయ అధికారులు శాంతి పూజలు చేశారు.

- వివరాలు 8లో▸

న్యూస్‌రీల్

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- ఎస్పీ జానకీషర్మిల



తొండాల గ్రామంలో పర్యటిస్తున్న ఎస్పీ

తానూరు: వరద ప్రభావిత ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ జానకీషర్మిల సూచించారు. మండలంలోనికోలూరు, తొండాల, మొగ్లి, జౌలా(బి) గ్రామాల్లో శుక్రవారం పర్యటించారు. శిథిలావస్థకు చేరిన ఇళ్లలో ఉండొద్దని సూచించారు. వరదలతో కలిగిన నష్టాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లేందుకు, సహాయ చర్యలు వేగవంతం చేయడానికి సూచనలు చేశారు. ఎస్పీ వెంట భైంసా ఏఎస్పీ అవినాష్‌కుమార్, ఎస్సై షేక్‌జుబేర్ ఉన్నారు.

పరిహారం ఇప్పించండి



అధికారితో మాట్లాడుతున్న గిరిజనులు

కడెం: మండలంలోని రాంపూర్, మైసంపేట్ పునరావాస గిరిజనులు ప్యాకేజీ-1 కింద రావాల్సిన పరిహారం కోసం శుక్రవారం కలెక్టరేట్‌లో వినతిపత్రం అందజేశారు. 18 నెలల క్రితం పాత ఊళ్లను ఖాళీ చేసి వచ్చామని, ఇప్పటికీ తమకు పునరావాస పరిహారం అందలేదని పేర్కొన్నారు. 48 మందికి ప్యాకేజీ-1 కింద రూ.15 లక్షల పరిహారం ఇవ్వాల్సి ఉందని తెలిపారు. ఉన్నతాధికారులు స్పందించి వెంటనే పరిహారం ఇవ్వాలని కోరారు. వినతిపత్రం ఇచ్చినవారిలో నర్స య్య, కోవ ప్రవీణ్, జైవంత్, జగ్గరావు, ఎల్లయ్య ఉన్నారు.

విద్యార్థుల ఉన్నతికి కృషి చేయాలి

లక్ష్మణచాంద: ఉపాధ్యాయులు విద్యార్థుల ఉన్నతికి కృషి చేయాలని డీఈవో రామారావు సూచించారు. మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలలను శుక్రవారం సందర్శించారు. నర్సాపూర్(డబ్ల్యూ) పాఠశాలలో విద్యార్థులతో కలిసి నేలపై కూర్చొని పఠన కౌశలాన్ని పరిశీలించారు. అన్ని అంశాలను ఆన్‌లైన్‌లో తప్పకుండా నమోదు చేయాలని హెచ్‌ఎంకు సూచించారు. అనంతరం మండలంలోని బాబాపూర్ ప్రభుత్వ పాఠశాలను సందర్శించారు. విద్యార్థులకు డిజిటల్ పరికరాల ఆధారంగా అన్ని తరగతుల్లో వివిధ అంశాలు బోధించాలన్నారు. మధ్యాహ్న భోజన సిబ్బందితో మాట్లాడి వారికి పలు సూచనలు చేశారు. ఆయన వెంట ఎంఈవో అశోక్‌వర్మ, జిల్లా విద్యాశాఖ సమన్వయకర్తలు రాజేశ్వర్, నర్సయ్య, ప్రవీణ్‌కుమార్, లింబాద్రి, జిల్లా పరీక్షల బోర్డు సహాయ కార్యదర్శి భానుమూర్తి, హెచ్‌ఎంలు సుజాత, భాస్కర్‌రెడ్డి, సీఆర్పీ సుధాకర్ ఉన్నారు.

పాలజ్‌కు ప్రత్యేక బస్సు

ఖానాపూర్: మహారాష్ట్రలోని పాలజ్(కర్ర గణపతి) దర్శనానికి వెళ్లే ఖానాపూర్ పట్టణ ప్రజల సౌకర్యార్థం ఖానాపూర్ నుంచి సూపర్ లగ్జరీ ప్రత్యేక బస్సు నడుపుతున్నట్లు ఆర్టీసీ అధికారులు తెలిపారు. ఉదయం 5.30 గంటలకు ఈ బస్సు ప్రారంభమవుతుందని, మార్గమధ్యలోని మాటేగావ్‌లోని కొరడి గణపతి ఆలయ దర్శనంతోపాటు పాలజ్ గణపతి దర్శనం అవకాశం కూడా ఉంటుందని పేర్కొన్నారు. అదే రోజు రాత్రికి ఖానాపూర్‌కు తిరుగు ప్రయాణమవుతుందని తెలిపారు. యాత్రకు వెళ్లే వారికి రానుపోను చార్జి రూ.620గా నిర్ణయించినట్లు వెల్లడించారు. ఆసక్తి గలవారు ఆన్‌లైన్‌లో టికెట్ బుకింగ్ చేసుకోవచ్చని పేర్కొన్నారు. వివరాలకు 9959225927 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

కళాశాల తనిఖీ

దిలావర్‌పూర్: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను డీఐఈవో పరశురాం శుక్రవారం తనిఖీ చేశారు. తరగతి గదుల్లోని సీసీ కెమెరాలను పరిశీలించారు. విద్యార్థులు హాజరు శాతంపై ఆరాతీశారు. ప్రస్తుతం కొనసాగుతున్న సిలబస్, పూర్తయిన సిలబస్‌పై అధ్యాపకులతో చర్చించారు. విద్యార్థుల ఫేషియల్ అటెండెన్స్ రిజిస్ట్రేషన్ ప్రక్రియ ఈనెల 30లోగా పూర్తి చేయాలని ఆదేశించారు. డీఐఈవో వెంట ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ రామారావు, అధ్యాపకులు ఉన్నారు.

నష్టమే మిగిలింది



ఈ ఫొటో చూస్తేనే విషయం అర్థమవుతోంది. రైతన్న కష్టం ఇసుకపాలైందని. కుంటాల మండలం అందకూర్ గ్రామానికి చెందిన దాసరి కిషన్ అనే రైతు 30 గుంటల్లో వరిసాగు చేశాడు. భారీ వర్షానికి వచ్చిన వరద పంటను ముంచెత్తడమే కాదు.. ఇలా ఇసుకమేటలు వేసి చేతికి రాకుండా చేసింది. రూ.65 వేల నష్టాన్ని మిగిల్చింది.



ఈ చిత్రంలో నేలవాలిన పత్తి చేనును దీనంగా చూస్తున్న రైతుపేరు గంగారావు. కుంటాల మండలం అంబకంటి గ్రామం. ఆరెకరాల్లో పత్తిపంట సాగుచేశాడు. ఈసారి కాలం కలిసి వస్తుందన్న నమ్మకంతో ఉన్నాడు. ఇంతలో భారీవర్షం ముంచేసింది. వరద ఉధృతికి పత్తిపంట నేలవాలింది. దీంతో రూ.3 లక్షల వరకు నష్టం వాటిల్లిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు.

- పంటలపై ఇసుక మేటలు..
- రైతుల కంట కన్నీళ్లు..
- 10 వేల ఎకరాలకుపైగా నష్టం
- పదులసంఖ్యలో దెబ్బతిన్న రోడ్లు
- ప్రమాదకరంగా 23 చెరువులు

నిర్మల్: 'అవసరమున్నప్పుడు రాని వాన.. వద్దంటే పగబట్టినట్టే కురిసింది. చేతికి వస్తుందనుకున్న పొలం ఇసుకపాలాయే. తెల్లబంగారమనుకున్న పత్తిపంట నేలవాలిపాయే. సాయమవుతదనుకున్న సోయా మునిగిపాయే.. మాకష్టం ఎవరికి చెప్పుకోవాలె..' అంటూ భారీవర్షానికి పంటలు నష్టపోయిన రైతులు కన్నీటిపర్యంతమవుతున్నారు. జిల్లాలో బుధవారం నుంచి గురువారం మధ్యాహ్నం వరకు దంచికొట్టిన వాన ఎన్నో అనర్థాలను మిగిల్చింది. దాదాపు 16 మండలాల్లో శుక్రవారం మధ్యాహ్నం వరకు వేసిన అంచనాల ప్రకారం 9,200 ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయి. ఇందులో 600 ఎకరాల్లో పంటలపై ఇసుక మేటలు వేసి, ఎందుకూ పనిరాకుండా చేసింది. ఆయా మండలాల్లో వరి, పత్తి, సోయాబీన్ పంటలకు కోలుకోలేని నష్టం వాటిల్లింది. వాగులు, కాలువలు ఉప్పొంగడంతో జిల్లాలోని ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్ రోడ్లు దెబ్బతిన్నాయి. భారీవాన జిల్లావ్యాప్తంగా ఐదు ఇళ్లను దెబ్బతీసింది. తానూరు మండలం మొగ్లి, ఝరి(బి), దౌలతాబాద్, ఎల్వత్, కోలూరు తదితర గ్రామాలకు రాకపోకలకు ఇబ్బంది ఏర్పడింది. జిల్లావ్యాప్తంగా 23 చెరువులు పూర్తిగా నిండి ప్రమాదకరంగా ఉండటంతో అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. జిల్లాలో శుక్రవారం భైంసా డివిజన్‌ను వర్షం ఇబ్బందిపెట్టింది. పట్టణంతోపాటు పలు మండలాల్లో లోతట్టు ప్రాంతాలు నీటమునిగాయి. మరోవైపు జిల్లా సరిహద్దుగా సాగుతున్న గోదావరి ఉగ్రరూపంలోనే ఉరకలెత్తుతోంది. పరివాహకంలోని పంటలను ముంచెత్తుతోంది.

పంటలపైనే ప్రతాపం..

ఈసారి వానప్రతాపం పంటలపైనే కొనసాగింది. సీజన్ ప్రారంభం నుంచి ప్రశాంతంగా వర్షాలు కురిసాయని రైతులు సంతోషంగా సాగు చేసుకుంటున్న సమయంలో వరుణుడు విరుచుకుపడ్డాడు. గోదావరితోపాటు, వాగులు, వంకలు, అలుగుల కింద దాదాపు 9,200 ఎకరాల పంట నష్టపోయినట్లు శుక్రవారం మధ్యాహ్నం వరకు అధికారులు అంచనా వేశారు. ఇందులో ప్రధానంగా పత్తి 2,823 ఎకరాల్లో, వరి 2,491ఎకరాల్లో, సోయాబీన్ 2,152 ఎకరాల్లో, మొక్కజొన్న 1,100 ఎకరాల్లో దెబ్బతింది.మొత్తం 4,762మంది రైతులు నష్టపోయినట్లు ఇప్పటి వరకు వ్యవసాయాధికారులు లెక్కతేల్చారు.

కొట్టుకుపోయిన పల్లె రోడ్లు..

జిల్లాలో 2021 నుంచి ఏటా వర్షబీభత్సం కొనసాగుతోంది. ప్రతిసారీ రోడ్లు దెబ్బతింటూనే ఉన్నాయి. ప్రధానంగా పల్లెరోడ్లు కాస్త గట్టివానకే కొట్టుకుపోతున్నాయి. ఈసారీ పంచాయతీరాజ్ శాఖ పరిధిలో 50కిపైగా రోడ్లు 122కి.మీ. మేర దెబ్బతిన్నట్లు అంచనా వేశారు. వీటిలో తాత్కాలిక మరమ్మతులకు రూ.1.07 కోట్లు, శాశ్వత మరమ్మతులకు రూ.6.80 కోట్లు అవసరమున్నట్లుగా అంచనా వేశారు. ఇక ఆర్‌అండ్‌బీ పరిధిలో 35-40 రోడ్లు దెబ్బతిన్నాయి. వీటి నష్టం అధికారులు అంచనావేస్తున్నారు. పలుచోట్ల విద్యుత్ స్తంభాలు విరిగిపోయాయి. ట్రాన్స్‌ఫార్మర్లు దెబ్బతిన్నాయి. నష్టం అంచనా వేసేపనిలో సిబ్బంది ఉన్నారు.

గోదావరి ముంచింది



పీచర సమీపంలో మునిగిన పత్తి పంట

- పోటెత్తిన వరదతో నీటమునిగిన పంటలు
- వరుసగా మూడో ఏడాది..
- ఆదుకోవాలని వేడుకుంటున్న రైతులు

లక్ష్మణచాంద: మూడు రోజులుగా జిల్లాలో కురుస్తున్న వర్షాలతోపాటు, ఎగువ ప్రాంతాల్లోనూ భారీ వర్షాలు కురవడంతో శ్రీరామ్‌సాగర్ ప్రాజెక్టుకు వరద పోటెత్తింది. దీంతో అధికారులు 39 గేట్లను ఎత్తి, గోదావరి నదిలోకి 5.75 లక్షల క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ఈ వరద లక్ష్మణచాంద మండలంలోని పీచర, ధర్మారం, పార్‌పెల్లి, మునిపల్లి, మాచాపూర్, చింతల్‌చాంద, చామన్‌పెల్లి గ్రామాల్లో వందల ఎకరాల్లో పంటలను ముంచింది. గోదావరి పరీవాహక గ్రామాల్లో రైతులు సాగు చేసిన పత్తి, మొక్కజొన్న, సోయా, వరి, పసుపు పంటలు పూర్తిగా నీటమునిగాయి. 285 రైతులకు చెందిన 315 ఎకరాల సోయా, 110 మంది రైతులకు చెందిన 125 ఎకరాల వరి, 55 మంది రైతుల 48 ఎకరాల పత్తి, 45 మంది రైతుల 85 ఎకరాల మొక్కజొన్న, మొత్తం 573 ఎకరాల్లో పంటలు నీటమునిగాయని మండల వ్యవసాయ అధికారి వసంత్‌రావు తెలిపారు. పంట పొలాలు చెరువులను తలపిస్తున్నాయని, నీటి కింద ఏ పంట ఉందో గుర్తించడం కష్టంగా ఉందని పేర్కొన్నారు. వరద తగ్గాక నష్టం మరింత పెరుగుతుందని వెల్లడించారు.

ఏటా ఇదే పరిస్థితి..

గత రెండేళ్లుగా భారీ వర్షాల కారణంగా పీచర, ధర్మారం, మునిపల్లి, మాచాపూర్, పార్‌పెల్లి, చింతల్‌చాంద గ్రామాల్లో వివిధ పంటలు నీటమునిగి రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఈ ఏడాది కూడా వర్షాలు మళ్లీ ఉధృతంగా కురవడంతో నష్టం మరింత తీవ్రమైందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 2003లో భారీ వర్షాల కారణంగా పంటలకు ఇంత తీవ్రమైన నష్టం జరిగిందని, 22 ఏళ్ల తర్వాత మళ్లీ ఇటువంటి విపత్తు తలెత్తిందని రైతులు కన్నీరు పెట్టుకుంటున్నారు.

పరిహారంపై ఆశలు..

సోయాబీన్, మొక్కజొన్న పంటలు ప్రస్తుతం కోతకు సిద్ధంగా ఉన్నాయి. పంట చేతికి వచ్చే సమయంలో వరదలు ముంచెత్తడంతో తీవ్రంగా నష్టపోయామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నష్టపోయిన తమను ఆదుకోవాలని, పరిహారం చెల్లించాలని వేడుకుంటున్నారు.

పూర్తిగా మునిగింది..



మూడెకరాలలో మొక్కజొన్న, పసుపు పంట వేశాను. గోదావరి ప్రవాహానికి పంట పూర్తిగా మునిగింది. మొక్కజొన్న చేతికి వచ్చే సమయంలో గోదావరి నిండా ముంచింది. ప్రభుత్వం ఆదుకోవాలి.

- పరమేశ్, రైతు

మూడేళ్లుగా నష్టపోతున్నాం



మూడెకరాల్లో మొక్కజొన్న, సోయాబీన్ సాగు చేసిన. ఎస్సారెస్పీ గేట్లు ఎత్తడంతో గోదావరి పొంగింది. వరద ఉధృతికి మూడెకరాలు నీటమునిగింది. వరుసగా మూడో ఏడాది పంట నష్టపోయా. ప్రభుత్వం పరిహారం ఇవ్వాలి.

- నర్సయ్య రైతు

భైంసా డివిజన్‌లో దంచికొట్టిన వాన



మొగ్లిలో నేలవాలిన సోయా చేనులో రైతు

- నీట మునిగిన పంటలు
- పలు గ్రామాలకు నిలిచిన రాకపోకలు

భైంసా/భైంసారూరల్/తానూరు: భైంసా డివిజన్‌లో గురువారం రాత్రి వర్షం దంచికొట్టింది. దీనికి తోడు ఎస్సారెస్పీ గేట్లు ఎత్తడంతో గోదావరి ఉప్పొంగింది. మరోవైపు మంజీరా వరద పోటెత్తింది. దీంతో బాసరలో గోదావరి మహోగ్రరూపం దాల్చింది. పరీవాహక ప్రాంత పంటలను ముంచింది. మహారాష్ట్ర నుంచి వచ్చే వరదతో సిరాల ప్రాజెక్టు నిండుకుండలా మారింది. అలుగు నుంచి వచ్చే నీటి ఉధృతికి గుట్ట సమీపంలోని దోని వద్ద కాలువ మరోసారి తెగింది. గడ్డెన్న వాగు ప్రాజెక్టు గేట్లు ఎత్తడంతో ఇలేగాం, సిరాల, దేగాం, వాలేగాం గ్రామాల్లోని పంటలు నీటమునిగాయి. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి.

నిలిచిన రాకపోకలు..

దేగాం-ఇలేగాం గ్రామాల మధ్య లోలెవల్ వంతెన నీటమునగడంతో రాకపోకలు నిలిచిపోయాయి. ముథోల్ మండలం ముద్గల్, తానూరు మండలం బోల్సా, ఝరి గ్రామాల్లో వాగులు పొంగి రవాణా స్తంభించింది. భారీ వర్షాలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

మళ్లీ మునిగిన వంతెన..

పల్సికర్ రంగారావు ప్రాజెక్టు బ్యాక్‌వాటర్‌తో గుండేగాం వంతెన మరోసారి నీటమునిగింది. శ్మశానవాటిక పూర్తిగా నీటిలో మునిగిపోయింది. ప్రాజెక్టు నీరు గ్రామంలోకి చేరుతోంది. పోలీసు అధికారులు రాకపోకలను నిలిపివేసి, అప్రమత్తమయ్యారు.

నీటమునిగిన పంటలు..

తానూరు మండలంలో కురిసిన వర్షంతో వాగు పరీవాహక ప్రాంతాల్లోని సోయా, పత్తి పంటలు నీటమునిగాయి. ఝరి(బి) లోలెవల్ వంతెన, మసల్గా తండా-మొగ్లి, దౌలతాబాద్, కోలూరు, వాడవన బోల్సా డబుల్ రహదారిపై నీరు ప్రవహించడంతో రాకపోకలు నిలిచిపోయాయి. ప్రయాణికులు గంటల తరబడి నిరీక్షించి గ్రామాలకు చేరుకున్నారు. బోల్సా గ్రామ సమీపంలో వరదకు రోడ్డు కొట్టుకుపోగా, ఎమ్మెల్యే రామారావు పటేల్ పరిశీలించారు.



మూసివేసిన దేగాం - ఇలేగాం రోడ్డు

బోల్సా, తొండల, మొగ్లి, మసల్గా, జౌలా(బి), మహాలింగి, బామ్ని గ్రామాల్లో పంటలు దెబ్బతిన్నాయి. ఎంపీడీవో నసీరొద్దీన్, ఎస్సై షేక్‌జుబేర్ గ్రామాల్లో పర్యటించి సమస్యలు తెలుసుకున్నారు.

'స్థానిక' కసరత్తు ముమ్మరం

- ముసాయిదా ఓటరు, పోలింగ్ కేంద్రాల జాబితా విడుదల
- ఎంపీడీవో, పంచాయతీ కార్యాలయాల్లో ఓటరు ప్రదర్శన
- నేటితో ముగియనున్న అభ్యంతరాల స్వీకరణ గడువు
- వచ్చేనెల 2న తుది జాబితా

నిర్మల్‌చైన్‌గేట్: రాష్ట్ర ఎన్నికల సంఘం గ్రామపంచాయతీ ఎన్నికల నిర్వహణకు శరవేగంగా ఏర్పాట్లు చేస్తోంది. తాజాగా, ఓటర్ల తుది జాబితా ప్రకటన షెడ్యూల్‌ను విడుదల చేసింది. దీంతో త్వరలో ఎన్నికలు జరిగే సూచనలు కనిపిస్తున్నాయి. రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు, జిల్లాలోని 400 గ్రామపంచాయతీలకు సంబంధించిన ఓటరు జాబితాలను వార్డుల వారీగా మండల పరిషత్, గ్రామపంచాయతీ కార్యాలయాల నోటీస్ బోర్డులపై గురువారం ప్రదర్శించారు. ఈ ముసాయిదా జాబితాపై అభ్యంతరాలను ఈ నెల 30 వరకు స్వీకరిస్తారు. శుక్రవారం జిల్లాస్థాయిలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. 30 వరకు అభ్యంతరాలు స్వీకరించి 31న పరిష్కరిస్తారు. సెప్టెంబరు 2న జాబితా ప్రకటిస్తారు.

అధికార యంత్రాంగం సిద్ధం..

జిల్లాలో గ్రామపంచాయతీ ఎన్నికల నిర్వహణకు అధికార యంత్రాంగం పూర్తి సన్నద్ధంగా ఉంది. బ్యాలెట్ బాక్స్‌లతోపాటు, ఇతర రాష్ట్రాల నుంచి 1,730 బాక్స్‌లు సమకూర్చారు. ఎన్నికల నిర్వహణకు అవసరమైన ఉద్యోగుల నివేదికలు సిద్ధం చేశారు. 3,368 వార్డులకు అనుగుణంగా పోలింగ్ కేంద్రాల ఏర్పాటు చేశారు.

పోటీకి సిద్ధమవుతున్న ఆశావహులు..

గ్రామపంచాయతీ ఎన్నికల ఆలస్యంతో ఆశావహులు నిరీక్షిస్తున్నారు. బీసీ రిజర్వేషన్ల అమలుపై స్పష్టత లేకపోవడం ఆలస్యానికి కారణమని భావించారు. అయితే, కాంగ్రెస్ ప్రభుత్వం రిజర్వేషన్ల అమలుపై ప్రకటన చేయడం, ఓటరు జాబితా షెడ్యూల్ విడుదలతో ఆశావహుల్లో ఉత్సాహం చిగురించింది. సెప్టెంబరు 30లోగా ఎన్నికలు నిర్వహించాలన్న హైకోర్టు ఆదేశాల నేపథ్యంలో, త్వరలో ఎన్నికల షెడ్యూల్ విడుదలయ్యే అవకాశం ఉంది.

తుది ఓటరు జాబితాకు సహకరించాలి

గ్రామ పంచాయతీల ఎన్నికల నేపథ్యంలో తుది ఓటరు జాబితా రూపకల్పనకు రాజకీయ పార్టీలు సహకరించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ కోరారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. మండల కేంద్రాలు, గ్రామ పంచాయతీలు, వార్డుల వారీగా ముసాయిదా ఓటరు జాబితాను ఇప్పటికే ప్రదర్శించామన్నారు. ఈ జాబితాలపై అభ్యంతరాలను ఈనెల 30వ తేదీ వరకు స్వీకరిస్తామని తెలిపారు. సెప్టెంబర్ 2న తుది జాబితాను విడుదల చేస్తామని స్పష్టం చేశారు. సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికల నిర్వహణలో ఎలాంటి లోపాలు లేకుండా రాజకీయ పక్షాలు సహకరించాలని తెలిపారు. సమావేశంలో బీజేపీ నాయకుడు కోరిపెల్లి శ్రవణ్‌రెడ్డి, ఎంఐఎం నాయకుడు మజార్, బీఆర్‌ఎస్ నేత కోరిపెల్లి రాంకిషన్‌రెడ్డి, టీడీపీ నేత రమేశ్, వైఎస్సార్‌సీపీ నేత నరేశ్, ఆప్ నేత హైదర్ పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా అధికారులు

ఎన్నికలకు ఏర్పాట్లు చేయాలి

- రాష్ట్ర ఎన్నికల సంఘం కార్యదర్శి మకరందు మంద

నిర్మల్‌చైన్‌గేట్: స్థానిక సంస్థల ఎన్నికలకు పటిష్టమైన ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర ఎన్నికల సంఘం కార్యదర్శి మకరందు మంద ఆదేశించారు. అదనపు కలెక్టర్లతో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ ప్రణాళికపై శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు అవసరమైన సదుపాయాలు సమకూర్చుకోవాలన్నారు. ఎన్నికలు నిర్వహించేందుకు సిద్ధంగా ఉండాలని సూచించారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్‌అహ్మద్ మాట్లాడుతూ అధికారులంతా స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధంగా ఉండాలన్నారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించి అవసరమైన సామగ్రి సమకూర్చుకోవాలని సూచించారు. వీడి యో కాన్ఫరెన్స్‌లో జెడ్పీ సీఈవో గోవింద్, డీపీవో శ్రీనివాస్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

జిల్లాలో ఓటర్ల వివరాలు..

మొత్తం	4,49,302
పురుషులు	2,13,805
స్త్రీలు	2,35,485
ట్రాన్స్‌జెండర్లు	12
పంచాయతీ డివిజన్లు	02
మొత్తం మండలాలు	18
గ్రామపంచాయతీలు	400
వార్డులు	3,368

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

ఖానాపూర్: భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ సూచించారు. పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఖానాపూర్, కడెం, పెంబి, దస్తూరాబాద్ మండలాల అధికారులతో శుక్రవారం సమీక్ష నిర్వహించారు. విద్యుత్, ఇరిగేషన్, రెవెన్యూ, మండల పరిషత్, ఇతర శాఖల అధికారులు వర్షాల సమయంలో స్థానికంగా ఉండి ప్రజలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేయాలన్నారు. రోడ్లు దెబ్బతిన్న చోట తాత్కాలిక మరమ్మతులు చేపట్టడంతోపాటు శాశ్వత మరమ్మతుల కోసం ప్రతిపాదనలు పంపాలని సూచించారు. ఎస్సారెస్పీతోపాటు సదర్మాట్, గోదావరి, చెరువులు, కుంటలు, ఇతర వరద ప్రభావిత ప్రాంతాల్లో నీటి ప్రవాహాలను ఎప్పటికప్పుడు గమనించాలన్నారు. అంతకుముందు పట్టణంలోని మైనార్టీ స్కూల్‌కు వెళ్లే మార్గంలో కొట్టుకుపోయిన తాత్కాలిక రోడ్డును పరిశీలించారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్

వస్తారు.. చూస్తారు.. వెళ్తారు..!

- సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలి
- కలెక్టర్‌కు ముంపు బాధితుల మొర

భైంసాటౌన్: 'భైంసాలోని గడ్డెన్నవాగు ప్రాజెక్టుతో ఏటా తమ కాలనీలు ముంపునకు గురవుతున్నాయి.. మునిగినప్పుడే అధికారులు, ప్రజాప్రతినిధులు వస్తున్నారు.. చూసి వెళ్లిపోతున్నారని సమస్యను శాశ్వతంగా పరిష్కరించడం లేదు' అని ముంపు బాధితులు కలెక్టర్‌కు తెలిపారు. కలెక్టర్ అభిలాష అభినవ్, ప్రత్యేకాధికారి హరికిరణ్ పట్టణంలోని రాహుల్‌నగర్, ఆటోనగర్ ప్రాంతాలను శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా రాహుల్‌నగర్‌లోని డబ్బాకాలనీవాసులు పలువురు కలెక్టర్‌కు తమ సమస్యలు చెప్పుకున్నారు. కాలనీని ఆనుకుని ఉన్న డ్రెయినేజీ కుచించుకుపోయి, వర్షపు నీరు, మురుగునీరు వెళ్లేదారి లేక ఇళ్లలోకి వస్తోందని తెలిపారు. ఎగువన సాత్‌పూల్ వంతెన వద్ద ఒకరు తన భూమికి ఆనుకుని బండరాళ్లు వేశారని, దీంతో సుద్దవాగులోని వరదనీరు కాలనీని ముంచుతోందని పేర్కొన్నారు. ఆటోనగర్‌లోనూ ఎంఐఎం నాయకులు పలువురు కలెక్టర్‌కు సమస్యలు విన్నవించారు. గడ్డెన్నవాగు ప్రాజెక్టు నీటితో ఏటా ఆటోనగర్‌లోని చాలావరకు ముంపునకు గురవుతోందన్నారు. ప్రాజెక్టు దిగువన సుద్దవాగు వెంబడి నీరు పారేందుకు సరైన మార్గం లేక కాలనీలోకి నీరు చొచ్చుకొస్తోందని తెలిపారు. వాగు వెంట ఇష్టారీతిన ఆక్రమణలతో ఈ పరిస్థితి ఎదురవుతోందన్నారు. స్పందించిన కలెక్టర్ ప్రస్తుతం.. భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలను అప్రమత్తం చేసేందుకు వచ్చినట్లు పేర్కొన్నారు. సమస్య పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అధికారుల వెంట అదనపు కలెక్టర్ కిశోర్ కుమార్, సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్‌కుమార్, తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్, మున్సిపల్ కమిషనర్ బి.రాజేశ్‌కుమార్ ఉన్నారు.



రాహుల్‌నగర్‌లో స్థానికులతో మాట్లాడుతున్న కలెక్టర్ అభిలాష అభినవ్, ప్రత్యేకాధికారి హరికిరణ్

త్వరలో మరమ్మతులు చేపడతాం

కుంటాల: భారీ వర్షాలకు దెబ్బతిన్న వంతెనలు, రోడ్లకు త్వరలో శాశ్వత మరమ్మతులు చేపడతామని కలెక్టర్ అభిలాష అభినవ్ తెలిపారు. మండలంలోని అందకూర్ అలుగు వద్ద బుంగను ప్రత్యేక అధికారి హరికిరణ్, అడిషనల్ కలెక్టర్ కిశోర్‌కుమార్‌తో కలిసి పరిశీలించారు. వరదల కారణంగా నీటి ప్రవాహంలోకి వెళ్లొద్దని సూచించారు. వారివెంట తహసీల్దార్ కమల్‌సింగ్, ఎంపీడీవో అల్లాడి వనజ, ఎంపీవో రహీంఖాన్ ఉన్నారు.

క్రీడా దిగ్గజం ధ్యాన్‌చంద్

నిర్మల్‌టౌన్: భారత హాకీ నైపుణ్యాన్ని ప్రపంచానికి చాటిచెప్పి దేశాన్ని ఉన్నత శిఖరాలకు తీసుకువెళ్లిన క్రీడాదిగ్గజం మేజర్ ధ్యాన్‌చంద్ అని హాకీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు పాకాల రాంచందర్, జిల్లా క్రీడల అధికారి శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. జాతీయ క్రీడా దినోత్సవం(మేజర్ ధ్యాన్‌చంద్ జయంతి) సందర్భంగా జిల్లా యువజన క్రీడల శాఖ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ మినీ స్టేడియంలో వేడుకలు శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ధ్యాన్‌చంద్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ధ్యాన్‌చంద్‌బంతిపై నియంత్రణ, అద్భుతం, నైపుణ్యం ఉత్తమ ప్రతిభ కలిపి ధ్యాన్‌చంద్‌ను హాకీ మాంత్రికుడిని చేశాయని వివరించారు. అనంతరం సీఎం కప్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను సన్మానించారు. మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్ గౌడ్, ఒలింపిక్ అసోసియేషన్ కన్వీనర్ శ్రీధర్‌రెడ్డి, అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పద్మనాభగౌడ్, సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ సెక్రెటరీ అన్నపూర్ణగౌడ్, ట్రస్మా అధ్యక్షుడు చంద్రగౌడ్, పేటా అధ్యక్షుడు భూక్యా రమేశ్, సెక్రెటరీ భోజన్న, దీక్ష జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ వెంకట్‌రెడ్డి, ఎస్జీఎఫ్ సెక్రెటరీ రవీందర్‌గౌడ్, పీడీలు, పీఈటీలు, క్రీడాకారులు, క్రీడాభిమానులు పాల్గొన్నారు.



ధ్యాన్‌చంద్‌కు నివాళులర్పిస్తున్న క్రీడా ప్రతినిధులు

గోదారమ్మ మహోగ్రరూపం

- బాసర గుడి సమీపానికి జలం
- మునిగిన లాడ్జీలు, దుకాణాలు
- పంట పొలాల్లో నిలిచిన నీరు
- ఆందోళన చెందుతున్న రైతులు
- 1983 తర్వాత మరోసారి వరద

బాసర: మూడు రోజులుగా ఏకధాటిగా కురిసిన వర్షానికి మండలంలోని లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. ఎగువన మహారాష్ట్రలోని బాబ్లీ ప్రాజెక్ట్ నుంచి ఎస్సారెస్పీలోకి వరదనీరు భారీగా వచ్చి చేరుతోంది. దీంతో గోదావరినది ఉప్పొంగి ప్రవహిస్తోంది. బాసరలోని హరిహర కాటేజీలో జలదిగ్బంధంలో చిక్కుకున్న రెండు కుటుంబాలకు చెందిన 11 మందిని రెవెన్యూ, పోలీస్, ఎన్డీఆర్ఎఫ్ అధికారులు బయటకు తీసుకువచ్చారు. బ్రిడ్జికి 10 ఫీట్ల కింది నుంచి ప్రవహిస్తూ గోదావరి ఉగ్రరూపం దాల్చింది. గోదావరి బ్యాక్ వాటర్‌తో పంట పొలాలు నీటమునిగి చెరువులను తలపిస్తున్నాయి. గోదావరి ఘాట్లు పూర్తిగా నీట మునిగాయి. బాసర రైల్వే స్టేషన్, శ్రీజ్ఞాన సరస్వతీ ఆలయ సమీపం వరకు నదీ జలాలు వచ్చాయి. సమీప గ్రామాల ప్రజలు భయాందోళనకు లోనయ్యారు. నదీ ప్రవాహంతో పలు రోడ్లు జలమయం కావడంతో బాసర నుంచి పలు గ్రామాలకు రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. గోదావరి బ్యాక్ వాటర్ కారణంగా సోయా, పత్తి, వరి పంటలు నీటమునిగాయి. దీంతో రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



ఆలయ సమీపంలో నీట మునిగిన పంట పొలాలు

ఆయా కాలనీల్లో వైద్యసేవలు

భారీ వర్షాల నేపథ్యంలో బాసరలోని పలు కాలనీలు అపరిశుభ్రంగా మారాయి. వరదనీటితో ఆయా కాలనీలవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీంతో ముందు జాగ్రత్తగా ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్యకేంద్రం ఆధ్వర్యంలో సూపర్‌వైజర్ ఆశాలత, ఏఎస్ఎం, సిబ్బందితో ఇంటింటా తిరిగారు. విష జ్వరాలు, ఇతర సమస్యలతో బాధపడుతున్న వారిని గుర్తించి సేవలందిస్తున్నారు. అవసరమైన మందులు పంపిణీ చేస్తున్నారు.



బిద్రెల్లి–టాక్లీ మధ్య ప్రధాన రహదారిని పరిశీలిస్తున్న ఎస్పీ జానకీ షర్మిల

ఆలయంలో శాంతిపూజలు



శాంతిపూజ నిర్వహిస్తున్న అర్చకులు

భారీ వర్షాలకు బాసర శ్రీజ్ఞాన సరస్వతీ కొలువుదీరిన క్షేత్రంలో గోదావరి నది ఉధృతంగా ప్రవహిస్తోంది. లోతట్టు ప్రాంతాలన్నీ జలమయం కావడంతో ఆలయ వైదిక బృందం సభ్యులు గోదావరి తల్లికి శాంతిపూజ, సౌభాగ్య ద్రవ్య సమర్పణ నిర్వహించారు. రాష్ట్రంలో ఎలాంటి ఆస్తి, ప్రాణ, పంట నష్టం జరగకుండా రాష్ట్ర ప్రజలందరినీ క్షేమంగా కాపాడాలని ఈ సందర్భంగా అమ్మవారిని వేడుకున్నట్లు సంజీవ్ పూజారి తెలిపారు.

నిలిచిన రైళ్ల రాకపోకలు



రైల్వే ట్రాక్ పక్కన నిలిచిన నీటిని పరిశీలిస్తున్న తహసీల్దార్, ఎస్సై

బాసరలో గోదావరి నదికి వరదనీరు పోటెత్తింది. గోదావరినదిపై ఉన్న రైల్వే బ్రిడ్జికి రెండు ఫీట్ల కింది నుంచే నీళ్ల ప్రవహిస్తుండడంతో ఆ శాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు రైళ్ల రాకపోకలను నిలిపివేస్తున్నట్లు బాసర స్టేషన్ మేనేజర్ రవీందర్ తెలిపారు. ప్రయాణికులు గమనించి సహకరించాలని కోరారు.

బాసర ఎస్బీఐలోకి చేరిన నీరు

గోదావరి నది ఉధృతంగా ప్రవహించడంతో ఎస్సారెస్పీ బ్యాక్ వాటర్ బాసర మండల కేంద్రంలోని ఎస్బీఐలోకి చేరింది. మేనేజర్ అశోక్‌కుమార్, అధికారులు అప్రమత్తమై వరద నీటిని బయటికి తీసేందుకు ప్రయత్నం చేశారు. రెండు, మూడు రోజులు సేవలకు అంతరాయం కలగవచ్చని వారు తెలిపారు. సహకరించాలని ఖాతాదారులను కోరారు.

ముమ్మరంగా సహాయక చర్యలు

వరద ముంపునకు గురైన బాసర మండంలోని ఓనీ, కౌటా, సావర్గం, సాలాపూర్, బిద్రెల్లి, లాబ్ది, టాక్లి గ్రామాలను ఎస్పీ జానకీ షర్మిల శుక్రవారం పరిశీలించారు. లోతట్టు ప్రాంతాల్లోని ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. ఎవరూ ఆందోళన చెందవద్దని సూచించారు. వరద ప్రవాహం ఉన్నచోట చెరువులు, కుంటలు, వాగులు వద్దకు వెళ్లొద్దని అప్రమత్తం చేశారు. స్థానిక తహసీల్దార్ పవన్‌చంద్ర, ఎంపీడీవో దేవేందర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి ప్రసాద్‌గౌడ్ ఎప్పటికప్పుడు వరద ప్రభావిత ప్రాంతాలను పర్యటిస్తూ ప్రజలకు తగిన సూచనలు చేస్తున్నారు.



బాధితులను తీసుకువస్తున్న పోలీసులు



తెప్పెలపై బాధితులతో వస్తున్న గజ ఈతగాళ్లు

‘గడ్డెన్నవాగు’కు తగ్గని వరద

- ఐదు గేట్ల ద్వారా నీటి విడుదల



గేట్ల ద్వారా విడుదలవుతున్న వరదనీరు

భైంసాటౌన్: పట్టణంలోని గడ్డెన్నవాగు ప్రాజెక్ట్‌లోకి శుక్రవారం భారీగా వరదనీరు చేరింది. ఎగువన మహారాష్ట్రలో కురిసిన వర్షాలకు రెండు రోజులుగా ఇన్‌ఫ్లో కొనసాగుతూనే ఉంది. ఉదయం 20వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రాగా, రెండు, మూడు గేట్ల ద్వారా సుమారు 20 వేల క్యూసెక్కులను దిగువకు విడుదల చేశారు. మధ్యాహ్నానికి ఇన్‌ఫ్లో మరింత పెరగడంతో మరో రెండు గేట్లు ఎత్తి 37వేల క్యూసెక్కులు దిగువకు వదిలారు. వరద గేట్లకు దిగువ ప్రాంతంలోగల గణేశ్‌నగర్ కోతి హనుమాన్ ప్రాంతంలో కుభీర్‌కు వెళ్లే రోడ్డు పూర్తిగా నీట మునిగింది. అటువైపు వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. అలాగే ఆటోనగర్‌తోపాటు రాహుల్‌నగర్‌లోని డబ్బా కాలనీ, భాగ్యనగర్‌లోకి వరదనీరు చొచ్చుకువచ్చింది. దీంతో అధికారులు ముందస్తుగా ఆయా కాలనీవాసులను పునరావాస కేంద్రానికి తరలించారు. సాయంత్రానికి ఇన్‌ఫ్లో తగ్గడంతో ఒక గేటు మూసివేశారు. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటిమట్టం 358.70 మీటర్లు కాగా, ప్రస్తుతం 358.20 మీటర్ల నీటిమట్టం కొనసాగిస్తూ నాలుగు గేట్ల ద్వారా 30వేల క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు.

‘కడెం’కు తగ్గిన వరద

కడెం: భారీ వర్షాలతో రెండురోజులుగా కడెం ప్రాజెక్ట్‌కు వరద పోటెత్తింది. శుక్రవారం ఇన్‌ఫ్లో తగ్గుముఖం పట్టడంతో వరద గేట్లు మూసివేశారు. రాత్రి 6,670 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తున్నట్లు ఇరిగేషన్ అధికారులు తెలిపారు. ప్రాజెక్ట్ పూర్తి స్థాయి నీటిమట్టం 700 అడుగులు కాగా, ప్రస్తుతం 695.400 అడుగుల నీటిమట్టం ఉందని వెల్లడించారు.

క్లుప్తంగా

దరఖాస్తుల ఆహ్వానం

కాగజ్‌నగర్‌టౌన్: పీఎంశ్రీ నవోదయ విద్యాలయంలో 2026–2027 విద్యాసంవత్సరంలో 9, 11 తరగతుల్లో ఖాళీ సీట్ల భర్తీకి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు కాగజ్‌నగర్ నవోదయ ప్రిన్సిపల్ రేపాల కృష్ణ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో ఎనిమిదో తరగతి చదువుతున్న విద్యార్థులు తొమ్మిదో తరగతిలో, పదో తరగతి చదువుతున్న విద్యార్థులు 11వ తరగతిలో ప్రవేశాలకు సెప్టెంబర్ 23లోపు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. ఫిబ్రవరి 7న ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. తొమ్మిదో తరగతిలో ప్రవేశాల కోసం https://cbseitms. nic. in/2025/ nvsix-9, 11వ తరగతిలో ప్రవేశాల కోసం https://cbseitms. nic. in/2025/ nvsxi-11లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

కజ్జర్ల శివారులో చిరుత సంచారం



కజ్జర్ల శివారులో చిరుత పాదముద్రలు

తలమడుగు: మండలంలోని కజ్జర్ల, దేవాపూర్ శివారులో చిరుతపులి సంచారం కలకలం రేపుతోంది. పంట పొలాలకు వెళ్లే రైతులకు చిరుత పాదముద్రలు కనిపించడంతో వారు పెద్దపులివిగా భావించి భయాందోళనకు గురయ్యారు. అటవీశాఖ బీట్ ఆఫీసర్ కృష్ణను సంప్రదించగా అవి చిరుతపులి అడుగులుగా గుర్తించారు. కజ్జర్ల, దేవాపూర్ శివారులో అటవీ ప్రాంతం నుంచి చిరుతపులులు వచ్చి వెళ్తున్నట్లు తెలిపారు. రైతులు, గ్రామస్తులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, అవి ఒకే చోట ఉండవని పేర్కొన్నారు. చిరుతపులి ఎవరికైనా కనిపిస్తే వెంటనే అటవీ అధికారులకు సమాచారం ఇవ్వాలని సూచించారు.

వేటగాళ్ల అరెస్ట్

సాత్నాల: భోరజ్ మండలం గిమ్మ గ్రామ సమీపంలో నాటు తుపాకీతో నాలుగు నెమళ్లు, ఒక కృష్ణ జింకను వేటాడి కాల్చి చంపిన మహారాష్ట్రలోని పార్వకు చెందిన రాథోడ్ సందీప్, రాథోడ్ యోగేశ్‌ను ఫారెస్ట్ అధికారులు శుక్రవారం అదుపులోకి తీసుకున్నారు. వీరి నుంచి నాటు తుపాకీ, కత్తి, వల స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసినట్లు ఎఫ్ఆర్వో గులాబ్ సింగ్ తెలిపారు. ఎఫ్ఎస్వో హైదల్ ఖాన్, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్లు సాయి, అమర్ తదితరులున్నారు.

నలుగురికి రిమాండ్

ఆదిలాబాద్‌టౌన్: జిల్లా కేంద్రంలోని శాంతినగర్‌కు చెందిన బోనాల రాజేశ్వర్‌కు సంబంధించిన ఆరు పందులను దొంగిలించిన నలుగురిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు వన్‌టౌన్ సీఐ సునీల్‌కుమార్ తెలిపారు. పట్టణంలోని భుక్తాపూర్‌కు చెందిన అల్లకుంట సంతోష్, దాండ్ల జనార్దన్, అల్లకుంట రాజేశ్, న్యూహౌసింగ్‌బోర్డుకు చెందిన రాకేశ్ ఈనెల 23న బొక్కల్‌గూడలో ఆరు పందులను దొంగిలించినట్లు పేర్కొన్నారు. వాటిని న్యూహౌసింగ్‌బోర్డులో దాచిపెట్టినట్లు తెలిపారు. మరోసారి చోరీకి యత్నించగా శుక్రవారం వారిని పట్టుకున్నట్లు పేర్కొన్నారు. విచారించగా చోరీకి పాల్పడినట్లు వారు అంగీకరించినట్లు తెలిపారు. వారి నుంచి ఐదు పందులు రికవరీ చేశారు. కాగా, వారు ఒక పందిని వధించి తిన్నట్లు సీఐ పేర్కొన్నారు.

క్రీడాకారులే నిర్ణేతలుగా..

- చిన్న వయస్సులోనే స్టేట్ రెఫరీలుగా..
- ఉమ్మడి జిల్లా క్రీడాకారుల ప్రతిభ

ఆదిలాబాద్: 19 ఏళ్ల వయస్సులో క్రీడల్లో రాష్ట్ర స్థాయి వేదికల్లో పతకాలు సాధిస్తే వారి గురించి గొప్పగా చెబుతుంటాం. డిగ్రీ స్థాయిలో క్రీడల్లో నైపుణ్యాలను మెరుగుపరచుకుని సత్తా చాటితే వారికి గొప్ప భవిష్యత్ ఉంటుందని అంచనా వేస్తాం. అయితే ఈ క్రీడాకారులు మాత్రం నైపుణ్యాలను అలవర్చుకోవడమే కాకుండా ఆ క్రీడపై పట్టు సాధించి అతి చిన్న వయస్సులోనే న్యాయ నిర్ణేతలుగా ఎంపిక కావడం విశేషం. మహబూబ్‌నగర్ వేదికగా నిర్వహించనున్న రాష్ట్రస్థాయి పోటీలకు వారు రిఫరీలుగా వ్యవహరించనున్నారు. టీనేజీలోనే రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ రెఫరీలుగా ఎంపికైన ఉమ్మడి జిల్లాకు చెందిన ముగ్గురు క్రీడాకారులపై కథనం.

ఆల్ రౌండర్‌గా వసంత



నిర్మల్ జిల్లాలోని కుంటాల మండలం అంబకంటి గ్రామానికి చెందిన చిక్కుడు చిన్నక్క–చిన్నయ్య దంపతుల కుమార్తె వసంత రాష్ట్రస్థాయి వేదికల్లో అథ్లెటిక్స్‌లో సత్తా చాటుతూ రాష్ట్రస్థాయి రిఫరీగా ఎంపికైంది. ట్రిపుల్ జంప్‌లో ఇప్పటివరకు రాష్ట్రస్థాయిలో ఒక స్వర్ణం, ఒక రజతం, ఒక కాంస్య పతకంతో మెరిసింది. ఒక స్వర్ణం, మరో కాంస్యంతో సత్తా చాటింది. షాట్ పుట్‌లో గోల్డ్ మెడల్ సాధించింది. హైజంప్‌లో రెండు కాంస్యాలతో ప్రతిభ కనబరిచింది. దాదాపు అన్ని ఈవెంట్‌లలో ఆల్ రౌండర్‌గా గుర్తింపు తెచ్చుకుంది. తాజాగా అథ్లెటిక్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా నిర్వహించిన డిస్ట్రిక్ట్ టెక్నికల్ అఫీషియల్ కోర్సులో ఉత్తీర్ణత సాధించింది. మహబూబ్‌నగర్ వేదికగా ఈ నెల 30, 31 తేదీల్లో నిర్వహించనున్న 11వ జూనియర్ రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ ఛాంపియన్ షిప్ పోటీలకు న్యాయ నిర్ణేతగా ఎంపికైంది.

డిస్కస్ త్రోలో జ్యోతి



ఆదిలాబాద్ జిల్లాలోని ఇంద్రవెల్లి మండలానికి చెందిన బిస్సే సుధామ–అనసూయ దంపతుల కుమార్తె జ్యోతి ప్రస్తుతం జిల్లా కేంద్రంలో డిగ్రీ ఫైనలియర్ చదువుతోంది. జ్యోతి డిస్కస్‌త్రోలో సత్తా చాటుతోంది. రాష్ట్రస్థాయి వేదికల్లో ఇప్పటివరకు రెండు రజత పతకాలు, ఓ కాంస్య పతకంతో సత్తా చాటింది. ఓవైపు ఓ అథ్లెట్‌గా రాణిస్తూనే అథ్లెటిక్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆన్‌లైన్ వేదికగా మే 16నుంచి 30వరకు నిర్వహించిన డిస్ట్రిక్ట్ టెక్నికల్ అఫీషియల్ కోర్సులో ఉత్తీర్ణత సాధించింది. కొద్దిరోజులుగా జిల్లాలో నిర్వహిస్తున్న జిల్లాస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో జిల్లా స్థాయి టెక్నికల్ అఫీషియల్‌గా బాధ్యతలు నిర్వహిస్తూ ఇప్పుడు మహబూబ్‌నగర్ వేదికగా ఈనెల 30, 31 తేదీల్లో నిర్వహించనున్న 11వ జూనియర్ రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ ఛాంపియన్ షిప్ పోటీలకు న్యాయ నిర్ణేతగా ఎంపికైంది. కాల్ రూమ్ కో ఆర్డినేటర్‌గా బాధ్యతలు నిర్వహించనుంది.

జంప్స్ రెఫరీగా అనిల్



ఆదిలాబాద్ జిల్లాలోని బజార్‌హత్నూర్ మండలం మంజరామ్ తండాకు చెందిన అజాడే శారదాబాయి–గురుదయాల్ సింగ్ దంపతుల కుమారుడు అనిల్ ప్రస్తుతం జిల్లా కేంద్రంలో డిగ్రీ ఫైనలియర్ చదువుతున్నాడు. రాష్ట్రస్థాయిలో ఇప్పటివరకు స్టీపుల్ చేజ్, హ్యామర్ త్రోలో కాంస్య పతకాలతో మెరిశాడు. ట్రిపుల్ జంప్‌లో రజత పతకంతో సత్తా చాటాడు. మేలో అథ్లెటిక్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా నిర్వహించిన డిస్ట్రిక్ట్ టెక్నికల్ అఫీషియల్ కోర్సులో అర్హత సాధించాడు. తాజాగా మహబూబ్‌నగర్ వేదికగా నిర్వహించనున్న 11వ జూనియర్ రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ ఛాంపియన్ షిప్ పోటీలకు రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో లాంగ్ జంప్, హై జంప్, ట్రిపుల్ జంపు ఈవెంట్‌లో న్యాయ నిర్ణేతగా వ్యవహరించనున్నాడు.

సద్గురు బోధనలు అనుసరణీయం

- నేడు పూలాజీ బాబా జయంతి
- భారీగా తరలిరానున్న భక్తులు

జైనూర్: తన హితబోధతో ఎంతోమంది జీవితాల్లో వెలుగులు నింపిన మహనీయుడు సద్గురు పూలాజీ బాబా. మహారాష్ట్రలోని పర్భని జిల్లా, నాగ్‌నాథ్ ఔండా తాలుకాలోని బయాస్‌రావు గ్రామంలో 30 ఆగస్టు 1925లో ఆంధ్ తెగలోని నిరుపేద వ్యవసాయ కుటుంబానికి చెందిన ధోండిజీ ఇంగ్లే–పుంజాబాయి పుణ్య దంపతులకు బాబా జన్మించారు. తల్లి పుంజాబాయి గొప్ప శివభక్తురాలు, భజన, సత్సంగ కార్యక్రమాల్లో పాల్గొనేవారు. చిన్న వయస్సులోనే పూలాజీబాబా తండ్రి కరువు కాటకాల నుంచి తప్పించుకుని బతుకుదెరువు కోసం కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా జైనూర్ మండలంలోని పట్నాపూర్ ఆంద్‌గూడ గ్రామానికి 1947లో శాశ్వతంగా వలస వచ్చారు. వ్యవసాయం చేస్తూ జీవనం కొనసాగించారు. తల్లి పుంజాబాయి, గురువు గణపతి వాఘ్మరే బోధనలతో ప్రభావితమైన పంచాగ్ని యోగా సాధనతో పాటు వేదాలు, ఉపనిషత్తులు ఆధ్యాత్మిక గ్రంథాలను చదివి పూలాజీ బాబా పరమయోగిగా మారారు.

బాబా తత్వమిదే..

‘అనంత విశ్వంలో మనమున్నాం. మనలో విశ్వం దాగి ఉంది. పంచభూతాల నిలయం మానవ దేహం. ఈ దేహమే దేవాలయం. శరీరంలోని కుండలి, శక్తిని ఉత్తేజితం చేయడంతో భక్త సాక్షాత్కారం లభించి ప్రశాంత జీవితం పొందగలరు’ అని ఆయన బోధించారు. జీవుడే దేవుడు అంటూ భక్తుల మానసిక వికాసానికి జీవితాంతం కృషి చేసి గురుపీఠం గౌరవాన్ని పెంచిన పరమ యోగి శ్రీసిద్ధి యోగా పీఠం, సిద్ధేశ్వర సంస్థాన్‌ను నెలకొల్పారు.

ఆత్మ విశ్వాసాన్ని నింపిన బోధనలు

బాబా బోధనలు ఎందరిలోనో ఆత్మ విశ్వాసాన్ని నింపాయి. అనేక మంది జీవితాలు ఇతరులకు ఆదర్శమయ్యాయి. బాబాను విమర్శించే వారు అతడి పాదక్రాంతులయ్యారు. బాబా భక్తులు నేటికీ అతడు చూపిన మార్గంలో జీవిస్తూ ఆయా గ్రామాల్లో ధ్యాన కేంద్రాలు నెలకొల్పారు. మూఢ నమ్మకాలకు స్వస్తి పలికి సత్ప్రవర్తనను అలవర్చుకున్నారు. పూలాజీ బాబా హితబోధతో ఎంతోమంది జీవితాలు మారాయి. నేటికీ బాబా చూపిన మార్గంలో భక్తులు మాంసాహారం, మద్యానికి దూరంగా ఉంటూ ఆధ్యాత్మిక మార్గంలో నడుస్తున్నారు.



పూలాజీబాబా (ఫైల్)

12 ఏళ్లు తపస్సు చేసి..

మల్లంగి తపోభూమిలో 12 ఏళ్లు బాబా తపస్సు చేశారు. మల్లంగి అరణ్య ప్రదేశం దట్టమైన వృక్షాల నడుమ ఓ నది తీర ప్రాంతంలో అల్లనేరేడు వృక్షం కింద తపస్సు చేసేవారు. ఈ క్షేత్రం నేడు సిద్ధేశ్వర సంస్థాన్ మల్లంగిగా పిలువబడుతోంది. బాబా ఇక్కడే ధ్యానధారణ చేసేవారు. పూలాజీ బాబాకు 1965–66లో ఆత్మసాక్షాత్కారం అయింది.

వేడుకలకు ఇతర రాష్ట్రాల నుంచి..

జైనూర్ మండలంలోని పట్నాపూర్ శనివారం నిర్వహించనున్న పూలాజీ బాబా జయంతి వేడుకలకు తెలంగాణతోపాటు మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల నుంచి వేలాదిగా భక్తులు సిద్దేశ్వర సంస్థాన్‌కు తరలిరానున్నారు. ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేశ్, కలెక్టర్ వెంకటేశ్ దోత్రే, ఎస్పీ కాంతిలాల్ పాటిల్, ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా, ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి, ఎమ్మెల్సీ దండే విఠల్, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్, కిన్వట్ ఎమ్మెల్యే భీంరావు కేరామ్ తదితరులు హాజరుకానున్నారు.

భార్య మృతికి కారణమైన భర్తకు 16 ఏళ్ల జైలు

మంచిర్యాలక్రైం: భార్య మృతికి కారణమైన భర్తకు 16 ఏళ్ల జైలు శిక్ష, రూ.21 వేల జరిమానా విధిస్తూ ప్రిన్సిపాల్ డిస్ట్రిక్ సెషన్స్ కోర్టు ప్రధాన న్యాయమూర్తి వీరయ్య శుక్రవారం తీర్పు ఇచ్చినట్లు స్థానిక ఏసీపీ ప్రకాశ్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. శ్రీ రాంపూర్‌కు చెందిన గరిగంటి కుమారస్వామి సోదరి పుష్పలతకు ఐబీ తాండూర్‌లోని అశోక్‌నగర్‌కు చెందిన సిగ్గార్ శుభ్రాత్‌తో 2019 మార్చి 16న వివాహమైంది. వారు మంచిర్యాలలోని చున్నంబట్టి వాడలోని శ్రీసాయి కాలనీలో అద్దెకుంటూ జీవనం సాగిస్తున్నారు. కొంతకాలంగా పుష్పలతను అదనపు కట్నం కోసం భర్తతో పాటు కుటుంబ సభ్యులైన ఐబీ తాండూర్‌లోని అశోక్‌నగర్‌కు చెందిన రాస్మాన్ సిగ్గార్, తులసి, అరికెల రమేశ్, మ్యారేజ్ బ్యూరోకు చెందిన భూతం భూమయ్య, శీలం సంజీవ్ తరచూ వేధిస్తున్నారు. పలుసార్లు పెద్దల సమక్షంలో పంచాయితీ పెట్టినా పద్ధతి మార్చుకోకుండా శారీరకంగా, మానసికంగా హింసించారు. వేధింపులు భరించలేక మనస్తాపం చెందిన పుష్పలత పురుగుల మందు తాగి 2019 డిసెంబర్ 23న ఆత్మహత్య చేసుకుంది. భర్త శుభ్రాత్, కుటుంబ సభ్యుల వేధింపులతోనే పుష్పలత ఆత్మహత్య చేసుకుందని మంచిర్యాల పోలీస్‌స్టేషన్‌లో తమ్ముడు కుమారస్వామి ఫిర్యాదు చేయగా అప్పటి ఎస్సై రాజమౌళిగౌడ్ కేసు నమోదు చేశారు. సాంకేతిక సాక్ష్యాధారాలతో నిందితులను కోర్టులో ప్రవేశ పెట్టగా పబ్లిక్ ప్రాసిక్యూటర్ సత్య శ్రీలత సాక్షులను విచారించగా, శుభ్రాత్‌పై నేరం రుజువైంది. దీంతో జైలు శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు. ఈ కేసులో నిందితులుగా ఉన్న రాస్మన్, తులసి, రమేశ్, భూమయ్య, సంజీవ్‌పై నేరం రుజువు కాలేదని తెలిపారు.

ఎక్కడి వాహనాలు అక్కడే..



భారీ వర్షాలకు కామారెడ్డి సమీపంలో జాతీయ రహదారి దెబ్బతినగా నాగ్‌పూర్, ఆదిలాబాద్ వైపు నుంచి హైదరాబాద్‌కు వెళ్లే వాహనాలను శుక్రవారం పోలీసులు నిర్మల్ జిల్లా సోన్ మండలం గంజల్ టోల్ ప్లాజావద్ద నిలిపివేశారు. దీంతో రెండు కిలోమీటర్ల మేర భారీ సంఖ్యలో వాహనాలు నిలిచిపోయాయి. - సాక్షి ఫొటోగ్రాఫర్, నిర్మల్

మృతదేహానికి రెండుసార్లు ఖననం

దిలావర్‌పూర్: ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా మండలంలోని కాల్వ గ్రామానికి చెందిన సాధ ఆశీర్వాదం అనే 70 ఏళ్ల వృద్ధుడి మృతదేహాన్ని 20 రోజుల వ్యవధిలో రెండుసార్లు ఖననం చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. వివరాలు.. ఆశీర్వాదం 20 రోజుల క్రితం మరణించాడు. అదేరోజు క్రైస్తవ సంప్రదాయం ప్రకారం గ్రామానికి ఆనుకుని ఉన్న కాలువ పక్కనున్న వారి శ్మశాన వాటికలో ఖననం చేశారు. కాగా, నాలుగైదురోజులుగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా కాలువలు, చెరువులు ఉప్పొంగి ప్రవహించాయి. ఆశీర్వాదం మృతదేహం ఖననం చేసిన ప్రాంతం కోతకు గురైంది. దీంతో ఆశీర్వాదం మృతదేహం వరదలో కొట్టుకువచ్చి పెద్ద చెరువు ప్రాంతానికి చేరింది. గమనించిన గ్రామస్తులు ఎస్సై రవీందర్‌కు గుర్తు తెలియని మృతదేహంగా భావించి ఫిర్యాదు చేశారు. గ్రామస్తుంతా అక్కడకు వెళ్లి పరిశీలించగా 20రోజుల క్రితం ఖననం చేసిన ఆశీర్వాదం మృతదేహంగా గుర్తించారు. దీంతో ఆ మృతదేహాన్ని వారి కుటుంబీకులకు అప్పగించగా మరోసారి ఖననం చేశారు.

చికిత్స పొందుతూ మృతి

ఆదిలాబాద్‌టౌన్: మహారాష్ట్రలోని కిన్వట్ తాలుకా బొందిడికి చెందిన కేంద్రె ఆకాశ్ (30) రిమ్స్‌లో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందినట్లు టూటౌన్ సీఐ నాగరాజు తెలిపారు. మద్యానికి బానిసైన ఆయన జీవితంపై విరక్తి చెంది ఈనెల 27న పురుగుల మందు తాగినట్లు పేర్కొన్నారు. గమనించిన కుటుంబీకులు చికిత్స నిమిత్తం రిమ్స్‌కు తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందినట్లు వివరించారు.

ఉరేసుకుని ఒకరి ఆత్మహత్య



సతీశ్ (ఫైల్)

రామకృష్ణాపూర్: పట్టణంలోని ‘ఏ’ జోన్ రాంనగర్ ప్రాంతానికి చెందిన చీపురుశెట్టి సతీశ్ (40) శుక్రవారం తెల్లవారుజామున ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు పట్టణ ఏఎస్సై వెంకన్న తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. కుటుంబ కలహాల కారణంగా సతీశ్ కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలోనే ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

పెంబిలో మరొకరు..

పెంబి: మానసిక స్థితి బాగా లేక ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై హన్మాండ్లు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన అందె రమేశ్ (40)కు కొంతకాలంగా మానసిక స్థితి బాగా లేదు. కుటుంబ సభ్యులు కొద్దిరోజుల క్రితం బెల్లంపల్లిలో చర్చికి తీసుకెళ్లి ప్రార్థన చేయించారు. అనంతరం మంచిర్యాల ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించి చికిత్స అందిస్తుండగా ఎవరికీ చెప్పకుండా ఇంటికి వచ్చాడు. శుక్రవారం ఇంటి నుంచి బయటకు వెళ్లి గ్రామ శివారులోని అటవీప్రాంతలో తాడుతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి భార్య భాగ్య, ఇద్దరు కొడుకులున్నారు. పెద్ద కొడుకు శివకుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.